మాయలేడి

ఉద్యోగికి దూర భూమి లేదంటారు. నేన్నమ్మను. అందకపోతేగదా ద్రాక్షపళ్లు పుల్లన! అందితే తియ్యగానే వుంటాయి. సత్తావున్నవారు స్వస్థలంలోనే ఉద్యోగం సంపాదించుకోగలరు. అక్కడ తగిన ఉద్యోగం లేకపోతే తనకంటూ ఒక పోస్టు క్రియేట్ చేయించుకోగలరు. రాజ్యం వీరభోజ్యమంటారు గదా! ఉద్యోగమున్నూ అంతే!

కరువు కాటకాలు వచ్చినప్పుడు రాయలసీమ ప్రజలు – బీదా బిక్కీ జనమేననుకోండి – పొట్ట చేతబట్టుకుని నదీ తీరమైదానాలకు వలస వెళ్లడం పరిపాటే! అందుకు భిన్నంగా ఒక విద్యావంతుడు బ్రతుకుతెరువుకోసం ఉత్తరాదినుంచి దక్షిణాదికి కొట్టుకొచ్చేశాడంటే ఏమనుకోవాలి? అదైనా భారీ గెజెటెడ్ ఉద్యోగమైతే ఆ సంగతి వేరు. ఇంతజేసీ హైస్కూలు టీచరు పోస్టు. 'ఈ మాత్రానికి నాలుగు జిల్లాలు దాటి యింతదూరం వచ్చారేమండీ మేష్టారుగారూ?' అంటే ఏడవలేక నవ్వు ముఖం పెట్టి 'ఉద్యోగికి దూర భూమి లేదు గదండీ!' అంటూ పాత లోకోక్తినే వల్లించాడు. ఆ బింకానికి వెనుక ఎంతటి దైన్యం గూడు కట్టుకుని వుందో మాకప్పటికి తెలియదు. ఆలోగా సర్టిఫికేట్లు తిరగేసి చూసిన ఆఫీసు గుమాస్తావల్ల విషయం కొంతవరకూ బోధపడింది. ఒకటి రెండు నెలల్లో ఆయనకు ముప్ఫై నాలుగోయేడు పూర్తి కావస్తోందట! ఇంకొక సంవత్సరం దాటితే ఉద్యోగార్హతకు కాలదోషం పట్టినట్టే! ఎవరు చెప్పగలరు? బహుశా యిదే చివరి అవకాశం కావచ్చు. అందుకని ఎండుటాకులా యిలా గిరవాట్లు తింటూ వచ్చినట్టున్నాడు మహానుభావుడు!

ఉద్యోగం సంపాదనలో వెనుకబడినప్పటికీ మిగిలిన విషయాల్లో నరహరి శర్మగారిది ముందంజేనని చెప్పాలి. ఇరవై రెండు వచ్చేసరికల్లా పెళ్లయిపోయింది. ముప్ఫైయేళ్లకల్లా ముగ్గురు బిడ్డల తండ్రి. అయితే అప్పటికే జీవితంలో ఎన్నో ధక్కా మొక్కీలు తిన్న శర్మగారి భార్య అదంతా గొప్ప పురుష ప్రతాపమని భావించలేదు. పురుష లక్షణమైన ఉద్యోగమనేది ఒకటి లేకపోతే ఎంత జన్మభూమి అయినా నరక సదృశమేననీ, ఎంత దగ్గరి వ్యక్తులైనా శత్రుతుల్యులేనని ఆమెకు తెలిసిపోయింది. మరింక భర్తకు ఉద్యోగం దొరికిన చోటు ఆమెకు పుణ్య స్థలంగా తోచడంలో విడ్డూరమేముంది? శర్మగారు ఉద్యోగంలో చేరిన వారం రోజులకే ఆమె బిడ్డలతోను, కొద్దిపాటి లగేజితోను వచ్చి మా వూర్లో దిగబడిపోయింది. చిన్న చుట్టిల్లు అయినా చాలు, సర్దుకోగలనంటూ స్థానికులైన మాకు భర్తద్వారా రాయబారం పెట్టించింది. కనీసపు సదుపాయాలతో కూడిన చిన్న పెంకుటింటినే చూచి పెట్టగలిగాను. చిల్లరకొట్టులో ఖాతా ఏర్పాటు చేశాను. పాలు, వంట చెరకు, కూరగాయలు మొదలైనవి నా పూచీమీద వాళ్ల యింటికి చేరేటట్టు ఆయా వ్యక్తులకు పురమాయించాను. మనుషులంటే మారుగబ్బుగా నడుచుకుంటూ వచ్చిన శర్మగారి భార్యకు ఎదుటివారి సద్భావ సౌజన్యాలపట్ల ఎక్కడలేని నమ్మకం పుట్టుకొచ్చేసింది. మొగమాటం లేకుండా ఎదుటికొచ్చి నిలబడి 'అన్నయ్యగారూ! మీ మేలు జన్మజన్మలకు మరచిపోలే' మంటూ చేతులు జోడించింది. పాపం, శర్మగారుగూడా మనసువిప్పి తన సోదంతా నా దగ్గర వెళ్లబోసుకున్నాడు.

"నాయనా బాలాజీ! నువ్వదృష్టవంతుడివి. పుట్టి పెరిగిన చోటనే నీకు ఉద్యోగం దొరికింది. ఉద్యోగంకోసం ఊళ్లు తిరగడమంటే ఏమిటో, మెట్లెక్కి దిగడమంటే ఏమిటో, ఉదయం ఎన్నో ఆశలతో నిద్రలేచి రాత్రుల్లో నిరాశగా పడుకోవడమంటే ఏమిటో నీకు తెలియదు. పడిన పడుబాట్లు ఆధారంగా సిద్ధాంత వ్యాసం రాసి పి. హెచ్.డి పట్టా పొందలేదు గానీ ఆ విద్యలో నేను అపారమైన అనుభవం గడించాను...' అనే పేరెప్పుడైనా విన్నావా? ఆ పట్నానికి ఏడు కిలోమీటర్ల దూరంలో మా వూరు – మానికొండ. మానికొండ సుందరనరసింగప్పెరుమాళ్లు అంటే ఒక కాలంలో ఒక వెలుగు వెలిగిన వైనం. చిన్న గుట్టపైన ముచ్చటైన గుడి. స్వామికి నవరత్న ఖచితమైన కిరీట, కేయూర, కంకణ, కంఠహారాది జవహరీ రెండు వీశెలదాకా వుండేది. మడి మాన్యాలకు కొదువేలేదు. గుడిలో దేవుడు కలకలలాడుతూ వుండినంతకాలం క్రింద అగ్రహారంకూడా మృష్టాన్నాలతో, పట్టు పీతాంబరాలతో, అగ్నిహోత్రాలతో, వేదగానాలతో అందాలకు నిలయంగా, ఆనంద ధామంగా వుంటూ వచ్చింది. ఇదంతా ఏనాటి మాట? నేను పుట్టక మునుపటి మాట. నా బుద్ధి నాకు వచ్చేటప్పటికి పరిస్థితులు పూర్తిగా వికటించాయి. క్షాత్ర తేజంనుండి మెరిసే సూర్యవంశపు రాజులకు, కోర మీసాల కొసల్ని జులపాలదాకా పెంచే తెలగ నాయుళ్ళకు గుడి ధర్మకర్తృత్వం పైన పేచీ వచ్చింది. ఉభయ వర్గాలు కోర్టుకు వెళ్లాయి. వాళ్లు హాజరుపరిచిన సాక్షుల కథనాన్ని విని విని, దాఖలు చేసిన రికార్డుల్ని చదివి చదివీ మునసబులకు మతులు పోయాయి. జడ్జీలు జుత్తులు పీక్కున్నారు. ఆఖరుకు హైకోర్టు గోడల్నికూడా అదరగొట్టేయాలన్న సంకల్పంతో కేసు హైదరాబాదుకేసి నడిచింది. ఈలోగా క్రింది కోర్టులిచ్చిన తీర్పుల మేరకు కొంతకాలం రాజులు, కొంతకాలం నాయుళ్లు ధర్మకర్తలుగా వుండి, చివరికెవరి పాలవుతుందో తెలియని గుడిలోని దేవునిపైన వైరాగ్యం పెంచుకుని, ఎంత దైవమైనా ఎత్తువారి చేతి బిడ్డేగదా అన్న కోపంతో వెక్కసపడిపోయి ఆయన భోగ భాగ్యాలను ఒక్కొక్కటిగా కత్తిరించడం మొదలెట్టారు. దిక్కులు తోచని హైకోర్టు మనుషులు చేసే గుడి మణియాన్ని రద్దుచేసి, స్పెషలాఫీసరును నియమించే సరికి నూనె అందక కొడిగట్టిన మట్టి ప్రమిదె దీపం చుట్టూ ముసరుకున్న చీకట్ల నడుమ సుందర నరసింగప్పెరుమాళ్లు మాసిన ఏకవస్త్రంతో, వన్నె తరిగిన పట్టెనామాలతో, పనికిమాలిన గిల్టు నగలతో వెలవెలపోతూ కనిపించాడు. అర్చకుడుగా మా నాన్నగారు నేర్చుకున్న నిత్యానుష్ఠానాలు, కరావలంబన స్తోత్రాలకు గుడిలోపలగానీ, బయటగానీ పూచిక పుల్లంత పరపతిగూడా లేకపోయింది. చిరకాలపు కైంకర్యానికి ఫలితంగా భగవంతుడాయన కిచ్చిందే ఒక ఆయవారపు చెంబు అయితే, ఆయన నాకేమిస్తారు? పైపెచ్చు ఏడుగురు సంతానంలో నేనొకడినై పోతిని. ఉప్పు తిని పోయిన గోడలతో, పెంకులు విరిగిపోయిన పై కప్పుతో, పెచ్చులెగిరిపోయిన నేలమట్టంతో జ్యేష్ఠాదేవి కొలువు కూటంలా తయారైన ఆ యింట్లో రచ్చలు, రగడలు, ఏడ్పులు, నిట్టూర్పులేగానీ నవ్వులు మాత్రం వినిపించేవిగావు. మానికొండ హైస్కూల్లో చదువు ముగించేదాకా మా యింట్లో నాకు తిండి దొరకడమే హెచ్చు. ఆ పరిస్థితుల్లో అంతకుమించి చదువుకోవాలని అనుకోవడం అత్యాశేనని నాకు తెలుసు. మండీలో లెక్కలు రాయడం, హోటల్లో టిఫిన్లందివ్వడం, థియేటర్లో టిక్కెట్లివ్వడం – యిలా చిన్నపని ఏదైనా దొరుకుతుందేమోనన్న ఆశతోనే నేను పట్నంలో కాలు మోపాను. అక్కడికి వెళ్లాక తెలిసొచ్చింది. బీద బ్రాహ్మలకు ఉచితంగా అన్నం పెట్టడమనే సాంప్రదాయం భారతదేశంలో ఇక్ష్వాకుల కాలంనుంచీ

వుందట! బ్రతుకుదెరువుకోసం నేను కాలుమోపిన పట్నంలో గూడా అలాంటి వాటిలో ఇంకా ఒక అన్నసత్రం మాత్రం కొన ప్రాణాలతో మిగిలి తారున చనిపోవడానికి గానీ, జబర్దస్తీగా జీవించడానికి గానీ వీల్లేకుండా ఆశ్రితులైనవారి కొకపూట భోజనం మాత్రం పెడుతోందట. నదిలోబడి కొట్టుకపోతూ దొరికిన కొయ్య దుంగను ఆలంబనగా పెట్టుకున్న వాడిలా నేను ఆ అవకాశాన్ని చేజిక్కించుకున్నాను. ఆశాకిరణం ఒకటి కనిపించేటప్పటికి చదువుకోవాలన్న కోరిక మళ్లీ చిగురించింది. ఉదయం అయిదు గంటలకు లేచి, పేపర్లను ఇళ్లకు చేరవేస్తూ, ఆ పనిమీద వచ్చిన అదనపు రాబడితో, ఎట్లాగో ఇంటరు చదువులోగూడా గట్టెక్కగలిగాను. ఒక ప్రక్క బ్రతకడం కోసం, యింకొక ప్రక్క చదువుకోవడంకోసం పరిస్థితులతో జరిపిన పోరాటంలో నేనప్పటికి పూర్తిగా అలసిపోయాను.

దానికితోడూ ఒంటిపూట భోజనం పెడుతూ వచ్చిన అన్నదాన సత్రానికిగూడా అప్పటికి నూకలు చెల్లిపోయాయి. నా కాళ్ల మీద నేను నిలబడడంకోసం ఎన్నో ఆలోచనలు చేసి చూచాను. ఇతరుల మెహర్బానీతోగానీ, స్వంత పెట్టుబడితోగానీ అవసరం లేకుండా, స్వంత బాధ్యత మీద నడుపుకోడానికి వీలున్న వ్యాసంగంగా నాకు స్ఫురించిందొక్కటే. ట్యూషన్లు చెప్పుకోవడం. అయిదారుగురితోనే ప్రారంభించాను. క్రమక్రమంగా ఉదయం ఇరవైమందీ, సాయంకాలం ఇరవై మందీ చేరడంవల్ల నెలకు నాలుగైదువందలదాకా కళ్ల జూడడానికి వీలయింది. నా జీవితంలో నాకదే పెద్ద సంపాదన. రోజులట్లా ఆనందంగా గడిచిపోయి వుండేవేనేమో! పులిమీద పుట్రగా వేలు విడిచిన మేనమామ ఒకాయన నాకు తారసిల్లాడు. నన్ను మించిన ప్రయోజకుడు మరొకరు లేనట్టు ఆయన తన మూడో కూతురిని నాకిచ్చి పెళ్లి చేశాడు. ఆ పెళ్లిలోనూ, పెళ్లయిన కొత్తలోనూ ఏమానందం అనుభవించానో, అంతే సంగతులు! తరువాత జీవితమంతా కృష్ణపక్షమే. కట్టుకున్న భార్యకు, కన్నబిడ్డలకు కనీసపు కోరికలు తీర్చాలన్నా నా సంపాదన సరిపోదని నిరూపణ అయిపోయింది. నా పాలబడిన నేరానికి వాళ్ల బ్రతుకునలా ఇసుకపర్రగా వదిలేయడం అమానుషమనిపించింది. ప్రయత్నలోపమేమీ లేదు. ప్రయివేటుగా బియ్యే పాసయ్యాను. బియ్యీడీ చేశాను. కాలికి బలపం కట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఉద్యోగం నా పాలిటికి మాయలేడి అయిపోయింది. ఒకరాజుగారు రెకమండ్ చేస్తే ఒక నాయుడుగారు అడ్డు తగిలేవారు. ఇంటర్వ్యూ చక్కగా చేశాంగదా, ఉద్యోగం ఖాయమనుకుంటే నలుడి పంచగుడ్డను పావురాలెత్తుకపోయినట్టుగా దాన్ని ఏ బంగార్రాజో, బాపినాయుడో తన్నుకపోయేవారు. ఆర్డరు చేతికొచ్చింది కదా అని ఆనందించడానికి వీలుండేదిగాదు. చేతికందిన కవళం నోటి కందితేగదా! బూరగపండు తినడంకోసం వేచి చూచే చిలక చందమైపోయింది నా బతుకు! నాయనా బాలాజీ! ఏం జెప్పమంటావు? ఒకటిగాదు. రెండుగాదు. నిండుగా పదేళ్లు. ఆడితే ఆడొచ్చు - కోకో ఆట! తావు చూసుకుని కూచోబోతానా, అదే క్షణంలో గూబ గుయ్యిమనేటట్టు 'కో' అంటూ కేక! మళ్ళీ పరుగెత్తు పరుగెత్తు! పరుగో పరుగు! ఎప్పుడయ్యా నాకు తావు దొరికేది? కాదంటే ఆడొచ్చు - మూజికల్ ఛేర్స్! ఉన్న కుర్చీలు తొమ్మిదైతే చుట్టూ పరుగెత్తే వాళ్లం పది మందిమి. గుండె ఢిగ్గుమనేట్టుగా విజిల్ వినిపించేటప్పటికి మిగిలిన తొమ్మండుగురూ కుర్చీల్లో బైటాయించి వుంటారు. మొదటి రౌండులోనే నేను అవుట్..."

కొద్ది నిమిషాలదాకా మౌనంగా వుండిపోయి నేనన్నాను - "ఏమైనా ఫరవాలేదు లెండి మేష్టరుగారూ! మీరు మార్గాంతరం గురించి ఆలోచించడం చాలా మంచిదైపోయింది.

ఇక్కడికొచ్చి చేసిన తొలి ప్రయత్నంతోనే ఫలితం కనిపించినందుకు ఎంత సంతోషంగా వుందో చెప్పలేను. అర్హత కలిగిన వ్యక్తికి న్యాయం జరిగిందంటే యిక్కడ ధర్మం కాస్తా మిగిలి వున్నట్టే లెక్క..."

శర్మగారు పెదవులు బిగించి పట్టుకుని తీక్షణంగా చూస్తూ నా తెలివితేటల్ని ఆరా తీస్తున్నటుగా ప్రశ్నించారు. "బాబూ బాలాజీ! ఈ ప్రాంతం మట్టుకు దేశంలో ఒక భాగం కాదంటావా?"

నేను తల్లక్రిందులైపోయాను. మబ్బు గుర్రాలపైన తేలిపోతున్న నా ఊహను భూమార్గం పట్టించాను. ఉన్న అవకతవకలు, అవలక్షణాలు దేశం ఎల్లెడలా వున్నాయి. అందుకే ప్రదేశమూ మినహాయింపుగాదు. అయినా యిక్కడ పాదం మోపడంతోటే వెదకబోయిన తీగ ఈయన కాళ్లకు చుట్టుకున్నదంటే...

"అందుకు కారణం ఇంద్రజాలమేమీ కాదులే!" కొనసాగించాడాయన."ఇంటర్వ్యూ బోర్డులో ఎవరుండినా, ఎవరుండకపోయినా డి.ఇ.ఓ.గారుంటారన్నది అందరికీ తెలిసిన విషయమే గదా! బండి దిగగానే నేను వివరాలు వాకబు చేసి తెలుసుకున్నాను. ఆయన పేరు జోగి సోమయాజి. ముక్కుకు సూటిగా వెళ్ళేరకమని అన్నారు. అంతకంటే నేరమెక్కడైనా వుందా? రాజ్యాధినేతల ఉక్కు పిడికిలి ఆయన తలపైన మొట్టికాయ వేయని చోటే లేదట! వాళ్లతో వచ్చిన వివాదాలకు, ఏర్పడిన గొడవలకు యింకొకరెవరైనా అయితే హై బీపీతో అయిపు లేకుండా పొయ్యేవారట! ఆయన నీతే ఆయన్ను కాపాడి వుంటుందని జనవాక్యం. పైపెచ్చు ఆయన రిటయిరు కావడానికింక మిగిలివున్నదల్లా రెండు నెలలు మాత్రమే! తోడ్పడితే అలాంటివాడే నాకు తోడ్పడాలన్నది నా నమ్మకం గూడా! మరునాటి ప్రాతఃకాలం ఆ యింటి యిల్లాలు తలుపు తీయగానే నేను లోపలికి చొరబడ్డాను. సోమయాజులుగారి పాదాలపైన పడలేదుగానీ, పడినంత పని చేశాను. ఏడవలేదుగానీ ఏడ్చినంత పని చేశాను. వింటే విను, వినకపోతే పొమ్మన్నట్టుగా, టేప్‌రికార్డర్ ఆన్ చేసినట్టు నా గోడంతా ఏకబిగిన వినిపించేశాను. ఎందుకులే? ఆయనగారి ముఖం జేవురించిపోయింది. కళ్లు ఎర్రబడ్డాయి. 'మధ్యాహ్నం ఇంటర్వ్యూ అయితే, తెల్లవారే టప్పటికి నా దగ్గరకొచ్చి చెవిలో రొదపెడుతున్నావు. ఎంత ధైర్యమయ్యా నీకు! వెళ్లెళ్లు జాప్యం చేశావో, పోలీసులకు ఫోన్ చేస్తాను. నిన్ను ఇంటర్వ్యూకే డిస్క్వాలిఫై చేస్తా'నంటూ అదరగొట్టేశారు. 'నిందు మనంబు నవ్య నవనీత సమానము, పల్కులాఖండల శస్త్రతుల్యము' అన్నారు గదయ్యా నన్నయ్యగారు! ఆ మాట సోమయాజులుగారి పట్ల సార్ధకమైంది. ఆయన చెక్కు చెదరకుండా నా పక్షాన నిలిచారు..."

ఎట్లాగో తన పబ్బం గడిచిందన్న సంతృప్తికన్నా, దాని నేపథ్యంలో ఎదురైన మనోగ్లాని శర్మగారిని నీడల దెయ్యంలా వెంటాడుతూ వున్నట్టు నేను గమనించాను. నా తాహత్తేమిటో తెలుసుకోకుండా కొన్ని పెద్దపెద్ద బాధ్యతలను భుజాన వేసుకోజూడడం నాకాదినుంచీ వున్న అలవాటే? ఆ మేరకు అసలు సమస్య ఎంతటి తీవ్రమైనదో తెలుసుకోకుండా ఏదో పొడి పొడి మాటలతోనే ఆయన్ను ఓదార్చ బోయాను.

"పడ్డ కష్టాలన్నీ పడ్డారు. ఇక మీదట మీకెలాంటి బాధలుగానీ వుండవు లెండి మేష్టారుగారూ! నిశ్చింతగా వుండండి."

ఒకటి రెండు క్షణాలు నావైపు అయోమయంగా చూచి ఆ తరువాత అందుకున్నారు శర్మగారు.

"నా ఒక్కణ్ణి గురించి కాదయ్యా నా బాధ! ఇదేమిటిలా జరుగుతోందన్నదే నా విచికిత్స. ప్రాణి పుట్టుక చాలా యాదృచ్ఛికమైన విషయం. నేను ఉత్తర ధ్రువంలో ఎస్కిమోల పిల్లాడినై పుట్టి వుండొచ్చు. బ్రిటీషు దీవుల్లో అచ్చం ధవళకాంతి శరీరఛాయతో పుట్టి వుండొచ్చు. ఇంకా ఆఫ్రికాలో, కొరియాలో, జపాన్‌లో ఎక్కడైనా పుట్టి వుండొచ్చు. భారతదేశాంతర్గతమైన ఆంధ్రప్రదేశంలో ప్రత్యేకించి ఫలానా 'తెగ'లో పుట్టాలని నేనే దేవుణ్ణో ప్రార్థించలేదు. నేను పుట్టకమునుపు అనేక దశాబ్దాలనాడే దానికి 'అగ్రవర్ణ'మన్న కితాబు ఒకటి కట్టబెట్టమని మనువుల్నిగానీ, ప్రజాపతుల్నిగానీ నేను కోరలేదు. 'నువ్వు పుట్టిన దేశం గొప్పది. నీ కులం గొప్పది. నీ పూర్వులు గొప్పవాళ్ళు?' అంటే సంతోషించడం సామాన్య మానవుల స్వభావం. ఒకప్పుడు నాకున్నూ మహదానందంగానే వుండేది. మా అగ్రహారంలో సంస్కృత భాషా విశారదులైన వృద్ధ పండితులు (అప్పటికే వాళ్లు ఒంటిపూట భోజనమైనా కడుపు నిండా చేయలేని దుర్దశలోకి వచ్చేశారన్నమాట అటుంచు) చెప్పుకోగా నేను చాలాసార్లు విన్నాను. మేము భారతీయ సంస్కృతీ పరిరక్షకులం. ఆర్షధర్మమనే మహాసౌధానికి బలమైన పునాదులం. మంత్రులమై రాజ్యాలను పాలన చేశాము. సేనానులమై యుద్ధాలు నిర్వహించాము. ఋత్విజులమై యాగాలు జరిపించాము. ఘనాపాఠీలమై వేదాలను తిరగ చదివాము. ఆచార్యులమై అజ్ఞాన తమస్సులను పారదోలాము. పురోహితులమై జనాన్ని పురోగతులకు నడిపించాము. బాగుంది. ఈ ఘనకీర్తి బాగానే వుంది. ఒప్పుకుంటాను. కానీ భూసురుడినన్న కితాబు నాకు భోజనం పెట్టడం లేదే! బ్రాహ్మడినై పుట్టినందుకు పదేళ్లు ఉద్యోగం లేకుండా **అలమటించానే!** రేకెత్తని తాజా పూలదండనైతే ఎవరైనా మెడలో వేసుకోడానికి ఉబలాట పడతారు. పువ్వులన్నీ రాలిపోయాక, అవశేషపు నూలు దారాలు ఉరి పోసుకోడానికి తప్పితే మరెందుకు పనికొస్తాయి? వృత్తుల్ని బట్టి వర్ణాలన్నావు, ఆ నియమం ఎక్కడ ఏడ్చింది? బ్రాహ్మడు బాటాలో చెప్పులమ్ముతున్నాడు. క్షత్రియుడు బల్లదగ్గర కూర్చుని కచేరిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక స్తోమత వున్నవాళ్లెవరైనాసరే, కుల మత భేదాల పాటింపు లేకుండా వ్యాపార, వాణిజ్య రంగాలలోకి నిరాఘాటంగా దూసుకుపోతున్నారు. శరీర దారుఢ్యం సరిపోతే చాలు భారత జాతీయుడెవడైనా మిలిటరీలో చేరొచ్చు. వృత్తుల రీత్యా వర్ణ వ్యవస్థకు అర్థం లేకుండా పోయింది. అయినా ప్రభుత్వం చట్టరీత్యా కొన్ని సదుపాయాలు కల్పించి కొందర్ని మాలిమి చేసుకుంటోంది. మరి కొందర్ని మీ చావు మీరు చావండి అని గాలికి వదిలేస్తోంది. అంగబలం, అర్థబలం, అధికారబలం వున్నవాళ్లు తమ కోసం, తమ వాళ్లకోసం ఇతరుల అవకాశాలను గూడా గద్దల్లా తన్నుకపోవడంలో ఆరితేరిపోయారు. ఇలా ప్రజల్లో కొందరు ముద్దు బిడ్డలుగాను, కొందరు సవతి బిడ్డలుగానూ పరిణమిస్తే ఎలా? 'ఎల్లలోకము లొక్కయిల్లై, వర్ణ భేదములెల్ల కల్లై' అన్న మహానుభావుణ్ణి మనం వేదికలపైన మెచ్చుకుంటాము. వర్ణాశ్రమ ధర్మాలను పునరుద్ధరించమనేవారి అడుగు జాడల్లో నడుస్తాము. ఎప్పుడు నాయనా ఈ దేశానికి విముక్తి? ఎప్పుడు బాబూ ఈ దేశంలో సమ ధర్మమూ, సమసమాజమూ నెలకొనేది?"

ఓ యబ్బో, చిన్న మట్టిగడ్డే ననుకున్నాను. ప్రేలిపోయాక తగు మాత్రపు అగ్నిపర్వతమని తెలిసింది. అయినా వ్యక్తిమాత్రుడు కంఠశోష పెట్టుకోగలడే తప్ప వ్యవస్థనెలా బాగు చేస్తాడు? ఆ పని మహామహామహనీయుల వల్లనే సాధ్యం గాకపోయింది గదా!

యుద్ధానికీ యుద్ధానికీ మధ్యనే శాంతి అంటారు. కొందరి బ్రతుకున్నూ అంతే! శర్మగారికి మా వూరెంతగానో నచ్చింది. మా వూరి వాళ్ళకున్నూ ఆయన అభిమాన పాత్రుడయ్యాడు. మావూరి గ్రామీణ సమాజంలో ఆ కుటుంబం పాలలో పంచదారలా కలిసిపోయింది. కానీ ఏం లాభం? అలా ఒక సంవత్సరకాలం గడవకముందే రాబందు రెక్కల నీడలా ట్రాన్స్ఫరొచ్చి ఆయన పైన వాలింది.

అదెలా జరిగిందంటె -

మా వూరికి 16 కి.మీ దూరంలో వున్న ఒక పెద్ద గ్రామం అయినంపాడు. ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షకు కూర్చున్న వాళ్లందరూ ఇంగ్లీషు సబ్జెక్టులో ఫెయిల్ కావడం వల్ల, ఆ వూరి హైస్కూలు పరీక్షా ఫలితాల్లో రికార్డు సాధించింది. అందుకు కారకుడైన ఇంగ్లీషు టీచరు సిగరమాకుల వరదారెడ్డిని డి.ఇ.ఓ. గారి ఫర్మానా పైన యాజమాన్యం పనిష్మెంటు చర్య క్రింద కర్ణాటక సరిహద్దులోని గాలివీడుకు బదిలీ చేసింది. వరదారెడ్డి రిలీవయ్యాడేగాని గాలివీడువైపు మాత్రం తిరిగి చూడనేలేదు. అందుకు బదులుగా జిల్లా ముఖ్య పట్టణానికి నాలుగైదుసార్లు వెళ్లొచ్చాడు. ఒకసారి హైదరాబాద్‌గూడా దర్శించాడు. సర్పయాగ ప్రమాదంనుంచి బయటపడదలచిన తక్షకుడిలా సదరు వరదారెడ్డి ఏ ప్రజాప్రతినిధి సింహాసనానికి చుట్టుకున్నాడో గాని నరహరిశర్మగారిని గాలివీడుకు బదిలీ చేసి, మా హైస్కూల్లో ఏర్పడిన ఖాళీలో ఆయన్ను నియమించారు. ఆ విధంగా ఒళ్లు వంచి చిత్తశుద్ధితో డ్యూటీ నిర్వహించిన నేరానికిగాను తండ్రి యయాతి ముసలితనాన్ని తనపైకి అవగాహన చేసుకున్న పూరుడిలా, పాపుల పాపాలకుగాను తాను బలైపోయిన క్రీస్తు ప్రభువులా నరహరిశర్మగారు నూలు తెగిన గాలిపటంలా గాలివీడుకు కొట్టుకపోయారు.

నాలుగైదేళ్లు గడిచిపోయాయి. ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించే మానసిక స్వస్థత శర్మగారికి ఉండాలనుకోడం దురాశే! బావిలో పడేసిన గుండ్రాయిలా ఆయన అతీగతీ తెలిసిందిగాదు. ఉన్నట్టుండి ఒకసారి స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో ఎదురు పడిపోయాడు. మనిషి చిక్కి సగమైపోయాడు. ఎడారిలో దారితప్పి పోయినవాడిలా వాడి, వడిలి, రూపే మారిపోయింది. "నాయనా బాలాజీ, నువ్వు క్షేమమా? నీ తల్లితండ్రులు క్షేమమా? నీ భార్యాబిడ్డలు క్షేమమా? మన సహోపాధ్యాయులందరూ క్షేమమా?" అని పేరు పేరునా అందరి కుశల వర్తమానాలు అడిగి తెలుసుకున్నారు. చివరకు "మీ సంగతేమిటి మేష్టరుగారూ?" అని నేనడిగితే "నాయనా! మేమంతా క్షామం" అని నిర్వేదం ప్రకటించారు. "ఏమిటి స్వామీ? ఎందుకలా అంటున్నారు?" అన్నాను. "మరేమనను బాబూ! అది పల్నాటి సీమకు తోబుట్టువులాంటి పడమటి గడ్డగదా! గడ్డీ గాదమూ, బోద దుబ్బులు, కంప మొక్కలు తప్పితే మరేవీ మొలిచి బ్రతకవు గదా! దేవ మాతృకలైన ఎత్తుపళ్లాల ఎర్రదుమ్ము నేలలుగదా! ఏం చేయగలం చెప్పు! అరమైలు దూరం నుంచీ తెప్పించుకున్న మంచినీళ్ళను టానిక్కులా వాడుకుంటాం. ఏ వస్తువు కావాలన్నా దబడబలాడే రేకుల బస్సుపైన పాతిక మైళ్లల్లో వున్న బస్తీకి చేరుకుంటాం. తప్పిదారీ ఎప్పుడైనా ఓ న్యూస్ పేపరు ఊళ్లోకి వచ్చేస్తే అడ్వర్‌టైజ్‌మెంట్ల దగ్గరినుంచి 'ఎడిటర్ అండ్ ప్రింటెడ్' దాకా చదివి, ప్రపంచ వార్తల్ని తెలుసుకుంటాం. స్కూల్లో తరగతి గదుల పూరికొట్టాల పైన కప్పు ఎగిరి పోవడంవల్ల వున్న ఒకేఒక రావిచెట్టు నీడలో బోదెకు చుట్టూరా మేమూ, పిల్లలమూ ఏంచక్కా వివిధ వయోరూపాల బోధిసత్వులంలా కూర్చుంటాం. పెద్దపిల్ల గాయత్రికి పదిహేనో యేడు. టెన్త్ క్లాసు కొచ్చింది. వచ్చే సంవత్సరం ఏం చదువుతుందో,

ఎక్కడ చదువుతుందో నన్నడగొద్దు. కుర్రాడికి పతంజలి అని పేరు పెట్టానని నీకు తెలుసుగదా! వాడు బ్రహ్మ సూత్రాలకు భాష్యం ఆలోచిస్తున్నట్టు ఆకాశంకేసి చూస్తూ కూచుంటాడేగానీ, చదువుపైన మొగ్గు జూపడంలేదు. చిన్న పిల్ల దేవయానికి వేలు చూపిస్తే, హస్తం మింగేసే తెలివి తేటలున్నాయి. ఉంటే సరిపోయిందా? అవి వినియోగమయ్యే అవకాశాలు చూపించాలి గదా! ఏమిటో నాయనా, బ్రతుకిలా తెల్లవారింది. ఎలా ప్రొద్దుపోతుందో తెలియదు" అంటూ ఆయన ఉసూరుమన్నారు.

కసువుకుప్పలో పడిపోయిన సూదిలా ఆ తర్వాత చాలాకాలం వరకు కనిపించకుండా పోయారు నరహరిశర్మగారు. ఒక సన్నిహిత వ్యక్తి జీవించివున్నాడనడానికి నిదర్శనం ఎప్పుడో ఎక్కడో హఠాత్తుగా తారసిల్లడమే! అదే జరిగింది. ఈసారి పుత్తూరు బస్‌స్టాప్‌లో కార్వేటి నగరం వెళ్ళే బస్సుకోసం వేచి వుండగా, తిరుత్తణి - నగిరి - నాగలాపురం బస్సునుంచి దిగి, ఒక చేత పొడుగాటి సన్నటి బరువైన సంచీతోనూ, మరొకచేత పకడ్బందీగా ప్యాక్ చేసిన అట్టపెట్టెతోనూ తిరుపతి బస్సులు నిలిచేవైపుగా సాగిపోతూ కనిపించారు నరహరిశర్మగారు. పరుగెత్తుకుంటూ వెళ్ళి దారికడ్డంగా నిలబడిపోయాను. "ఏమిటంటే మేష్టరుగారూ! ఎక్కడికిలా? ఇప్పుడెక్కడున్నారు? ఈ లగేజి అంతా ఎవరికోసం?" అంటూ ప్రశ్నలు గుప్పించాను.

అంతటి ఉద్వేగ సందర్భంలోగూడా నేను కొంచెం తెలివిగా ప్రవర్తించాననే చెప్పుకోవాలి. అదేమిటండీ 'ఏమిటండీ మేష్టరుగారూ! ఇలాగైపోయారు!' అంటూ దిగులు వెళ్లబోసుకోకపోవడం. అలా చేసి వుంటే పాపం, శర్మగారు వలవలా ఏడ్చేసి వుండేవారేమో! పలువురు ప్రయాణీకులుండేచోటు గదా! అలాంటి సన్నివేశం ఒకటి తయారుగాకపోవడం చాలా మంచిదైపోయింది.

మనిషి ఎట్టఎదుటనే వున్నా గొంతుక మాత్రం నూతిలో నుంచి వినిపించినట్టుంది.

"బాలాజీ, బాగున్నావా నాయనా! నా ప్రస్తుత నివాసం జమ్మికోట. తమిళనాడు సరిహద్దుకు క్రోసెడు దూరం. ఏ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థగానీ పట్టించుకోని ఏకాంత, అజ్ఞాత, అరణ్య సీమ. ఆ మాటకొస్తే గాలివీడుకు, జమ్మికోటకు మధ్య నేను మరి కొన్ని వూళ్లుగూడా దర్శించాను. అందువల్ల జిల్లా నైసర్గిక స్వరూపం, చారిత్రక విశేషాలు, సాంఘిక పరిస్థితుల, రాజకీయ వాతావరణం మొదలైన వాటిని గురించి క్షుణ్ణంగా ఆకళించుకుని నా లోక జ్ఞానాన్ని యిబ్బడి ముబ్బడిగా పెంపొందించుకోగలిగాను. నాపైన ఎన్నో ప్రయోగాలు చేసిన తర్వాత మన మేనేజిమెంటువారు ఆఖరుకు నాకన్ని విధాలా లాయల్ అయిన చోటేదో నిర్ధారణ చేయగలిగారు. అదే జమ్మికోట. మిగిలిన ప్రపంచంతో నామమాత్రమైన సంబంధాలు మాత్రమే కలిగి వుంటుంది గనుక దాన్ని బహిరంగ చెరసాల అనొచ్చు. అందులో నాకు పునరాలోచనకు తావులేని జీవిత శిక్ష..."

అదే ధోరణిలో వదిలిపెడితే శర్మగారెక్కడ మాట్లాడీ మాట్లాడీ, డస్సిపోతారోనని నేను భయపడిపోయాను. అందుకని దారి మళ్లించడంకోసం "యిలా ఎక్కడికి వెళ్తున్నారో చెప్పలేదే?" అని ప్రశ్నించాను.

పెద్ద కుమార్తె గాయత్రి బియ్యే మూడో సంవత్సరంలో వుందట. పరీక్షలకు సిద్ధంకావడంకోసం సెలవులిచ్చారు. బుద్ధి స్తబ్ధమై పోయే జమ్మికోటకు రాకుండా ఆమె హాస్టల్లోనే వుందట. తల్లి బిడ్డ కిష్టమైన తినుబండారాలు తయారుచేసింది. శర్మగారు చెరకు ముక్కలు సేకరించారు. వాటిని కుమార్తెకిచ్చి రావడంకోసం ఈ తిరుపతి ప్రయాణం.

ముందుగా వెళ్తుంటే నేనాయన్ను వెనుకవైపునుంచి చూస్తూ నిల్చున్నాను. ముడతలు పడిన పంచపైన ముదురు కాషాయ రంగు జుబ్బా తొడుక్కున్నారు. దయ్యాన్ని చూచి జడుసుకున్నట్టుగా తల వెంట్రుకలు నిక్కబొడుచుకుని గాలిలో కదులుతున్నాయి. అరిగిపోయిన హవాయి చెప్పుల్లోని పాదాలపైన దుమ్ము ఒక వరస పేరుకపోయింది. సులోచనాలెక్కడ జారి క్రింద పడిపోతాయోనని, తల కొంచెం పైకెత్తి ఆకాశంవైపే చూస్తున్నారు. ఈ తీరు తెన్నులతో ఆయన మామూలు ప్రపంచానికి చెందిన వ్యక్తిలా లేదు. ఉన్నా దానికి దరిదాపుల్లో తారట్లాడుతున్నట్టున్నారు.

***

నరహరి శర్మగారు నాకు పుత్తూరు బస్‌స్టాండులో కనిపించిగూడా ఏడెనిమిదేళ్లు గడచిపోయాయి. ఆయన జీవిత వృత్తాంతాన్ని యథాతథంగా ఒక కథగా రాసి, దుఃఖభాగుడనో దైవోపహతుడనో పేరుబెట్టి, ఏ పత్రికకైనా పంపాలన్న సంకల్పం ఈ వ్యవధిలో నాకెన్నోసార్లు కలిగింది. కానీ అంతలోనే 'ఎందుకులే బాబూ! ముంజేతి కంకణానికి అద్దాలెందుకు! ఈ వాస్తవాలన్నీ ఎవరికి తెలియనివి? జీవన పోరాటంలో పరాజితులైన దురదృష్టవంతుల గుండెల్లోని విషాదాన్నంతా ఒక చోటికి చేరిస్తే అది మహాపర్వతాలనే మీరిపోతుంది. ఉన్నచోట వుండిపోకుండా అందులో కొంత త్రవ్వి తీసి మళ్లీ లోకంపైకి వెదజల్లడమెందుకని నన్ను నేను మందలించుకుంటూ వచ్చాను. అయితే ఇటీవల రెండు నెలల క్రిందట జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో పి.సి.సర్కార్ ఇంద్రజాలం లాంటి ఆశ్చర్యకరమైన సన్నివేశం ఒకటి ఎదురయ్యాక, శర్మగారిని గురించి కథ రాయడం ఒక అనివార్య అత్యవసర చర్యగా పరిణమించింది. ఆ ప్రేరణను త్రోసిరాజన లేక ఈ పనికి పూనుకున్నాను.

సూర్యోదయానంతరం జరిగిన ఒక పెళ్లికి హాజరై, కళ్యాణ మండపములోనే ఉపాహారం తీసుకుని, తొమ్మిది గంటల ప్రాంతంలో నేను కొత్త బస్‌స్టేషనువైపు నడచిపోతున్నాను. ఓవర్‌బ్రిడ్జి పైన నడుస్తుండగా ఆటో ఒకటి నన్ను దాటుకుంటూ సాగిపోయి, పది బారల దూరంలో ఆగిపోయింది. అందులోనుంచి ఎవరో ఒకాయన గొంతెత్తి బిగ్గరగా నన్ను పేరు పెట్టి పిలుస్తున్నాడు.

వెనుదిరిగి వెళ్లి ఆటో దగ్గర నిలబడి, వంగి లోపలికి చూశాను.

"నేనేనయ్యా, నీ పాత స్నేహితుణ్ణి! చాలా కాలమైపోయింది కలసి. ఎప్పటికప్పుడు నీకు ఉత్తరం రాయాలనే అనుకోడం. ఏమిటో, ఆ పనంటే నాకు బద్ధకం. ఎన్నో కబుర్లు చెప్పుకోవలసి వుంది. కూచో, కూచో..."

బాగా పరకాయించి చూచిన తర్వాతగానీ ఆయన నరహరిశర్మగారని నేను తెలుసుకోలేకపోయాను. మడత నలగని ప్యాంటు తొడుక్కున్నాడు. పళపళలాడిపోతున్న గోధుమ రంగు సిల్కు జుబ్బా వేసుకున్నాడు. వెడల్పాటి ఫ్రేముగల కళ్లద్దాలలోంచి వెలువడుతున్న చూపుల్లో దైన్యచ్ఛాయలు కానరావటం లేదు. చెప్పినట్టుగానే వినే కుదురుపాటుతనం క్రాఫింగుకుగూడా అలవడినట్టుంది. వయసుకు తగిన శరీర పటుత్వం, అంతకు తగిన ఉత్సాహం ఆయనకిప్పుడు అలవోకగా దక్కిన సొమ్ములుగా వున్నాయి. ఇదంతా ఏ అమృతపానంవల్ల, లేదా ఏ కాయకల్ప చికిత్సవల్ల సాధ్యమైందో అంతు పట్టడం లేదు.

"శ్రీ కన్య ఎదురుగా వెళ్లుబాబూ! మేమక్కడ దిగిపోతాం" అంటున్నారాయన.

హోటల్లో ఎ.సి. రూము ఆ వేళప్పుడు రద్దీగా లేదు. ఓ మూలగా కుర్చీల్లో కూచున్నాము.

"నాయనా బాలాజీ! మొదట క్షమాపణ చెప్పుకోవాలయ్యా నీకు! పొరపాటు జరిగిపోయింది. అమ్మాయి పెండ్లికి ఆహ్వానం పంపలేకపోయాను. అసలాహ్వాన పత్రికలు అచ్చువేయలేదనుకో! హఠాత్తుగా, అనుకోకుండా జరిగిపోయింది..."

కాస్త తటపటాయిస్తూ అడిగాను. "ఏమైనా ప్రేమ వివాహమా మేష్టరుగారూ?"

"అదేలే వర్ణాంతరం గూడా! అబ్బాయి పేరు ఆనందరెడ్డి. బుద్ధిమంతుడు. బాగా చదువుకున్నాడు. పంచాయతీరాజ్‌లో అసిస్టెంటు ఇంజనీరు. చింతగుంట మండల ప్రజాపరిషత్ ప్రెసిడెంటుకు అన్నగారి కుమారుడు. జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్‌తోగూడా దగ్గరి చుట్టరికం వుంది. మా అమ్మాయి బియ్యాడీకూడా అయింది గదా! అయినా భర్త జిల్లా పరిషత్‌లో ఉద్యోగం వద్దనేశాడు. శ్రీపురం కాలనీలో 'లిటిల్ ఏంజెల్స్ కాన్వెంట్' అని వుందిలే! దానికి కరస్పాండెంటూ, హెడ్ మిస్ట్రెస్ కూడా మా అమ్మాయే! రెండేళ్లలోనే సంస్థ బాగా వికాసదశలోకి వచ్చేసింది. గాయత్రి మాటకేం గానీ మా అబ్బాయికిగూడా ఒకదారి దొరకడమే నాకు గొప్ప రిలీఫ్. చచ్చి సేయంగల విన్నపాలతో బియ్యే పాసై గోళ్ళు గిల్లుకుంటూ ఉండేవాడు. ఎట్లాగో ఆ సమస్యకూడా తీరిపోయి, వెల్‌ఫేర్ డిపార్టుమెంటులో ఉద్యోగమైంది వాడికి! హాస్టలు వార్డెను..."

ఉష్ణోగ్రత, రక్తపీడన, గాలిలో తేమ మొదలైన వాటిని కొలవడానికి సాధనాలున్నాయి. ఆశ్చర్యాతిరేకంతో స్థాయీ భేదాలు కొలవడానికి మట్టుకు వున్నట్టు లేవు. అవధులు దాటిన ఆశ్చర్యం అనుభవైక వేద్యం మాత్రమే. ఆ స్థితిలో బహుశా బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయేమో! అందువల్లనే ననుకుంటాను, వెయిటర్ బల్లదగ్గర నిలబడి 'ఏం కావాలి' అని మళ్లీ మళ్లీ వాకబు చేయడం నా చెవి దాకా రానే లేదు.

"తాజాగా చేసిన స్వీట్స్ ఏమైనా వుంటే పట్టుకురా" అంటున్నారు శర్మగారు. అప్పటికి నా బాహ్య స్మృతిగూడా నా కొచ్చేసింది. మనసంతటా నిండిపోయిన ఆశ్చర్యం ముఖంలో ద్యోతకం గాకుండా జాగ్రత్తపడుతూ "చిన్నమ్మాయి బాగా తెలివైందని చెబుతుండేవారు గదండీ! ఏం చేస్తోంది?" అని అడిగాను.

"తెలివైందే! మెడిసిన్ మూడో సంవత్సరంలో వుంది. కానీ... కానీ ఏమిటంటే బాలాజీ..."

"ఫరవాలేదు, చెప్పండి సార్! నేను నాలోనే దాచుకుంటాను. బయటెక్కడా పొక్కనీయను" అని మాట యిచ్చాను.

"అబ్బే ఇతరులకు తెలిస్తే వాళ్లేదో తలగొట్టి మొలేస్తారని కాదయ్యా నా ఉద్దేశ్యం. నువ్వేమనుకుంటావో అనే నా బెంగ. నాకున్న కొద్దిమంది శ్రేయోభిలాషుల్లో నువ్వొక్కడివి. నా జీవితంలోని ఏ రహస్యాన్నిగాని నీ నుంచి దాచుకోలేదు. ఇంతకూ ఇదేమైనా దాచి పెడితే దాగే విషయమా? ఎప్పుడో ఒకప్పుడు బహిరంగమైపోయేదే గదా! ఏం లేదు. ఈ రెండో పిల్ల దేవయాని పెళ్లిగూడా సాంప్రదాయ బద్ధంగా జరిగేట్టు లేదు. అందున గురించి ఆమె ఒక నిర్ణయానికొచ్చేసింది. ఏం చేద్దాం చెప్పు. అక్కా, బావా దానికి వత్తాసు..."

గొంతు తగ్గించి "అబ్బాయి ఎవరండీ?" అని ప్రశ్నించాను.

"ఉన్నాడులే. టి.పి. నాయర్. దొరబిడ్డలా వుంటాడు. హవుస్ సర్జన్ చేస్తున్నాడు. తాండ్ర పురాన్ నాయర్..."

విజ్ఞానశాస్త్రం కులాంతర, మతాంతరం, ఆ మాటకొస్తే దేశాంతర వివాహాలకు గూడా అడ్డు చెప్పదు. పైగా ఎంతటి దూరపు సంబంధమైతే అంత మంచిదనే అంటుంది. చట్టం వాటికి అండగా నిలుస్తుంది. ప్రభుత్వాధినేతలు ప్రోత్సహిస్తారు. సాంప్రదాయవాదులు తాము దేన్నయితే సాంప్రదాయమనుకుంటున్నారో, దాన్ని సృష్ట్యాది నుంచి చెక్కు చెదరకుండా కాపాడుకుంటూ వచ్చిన కులంగానీ, మతంగానీ, జాతిగానీ ఒక్కటి, కనీసం ఒక్కటైనా ఈ ధరాతలంపైన వుందా? 'నువ్వే మనుకుంటావో ననే నా బెంగ,' అని నన్నేమిటో మన్నన చేస్తూ శర్మగారన్నారు గానీ, లేనిది వున్నట్టుగా భావిస్తూ భ్రమల్లో బ్రతుకు వెళ్లదీసే చాదస్తపు మూర్ఖవాదుల జాబితాలో నేను మాత్రం నా పేరెందుకు నమోదు చేసుకుంటాను? కులంగానీ, సాంప్రదాయంగాని ఆయనకు బాసటగా నిలిచిందా. కవచమై రక్షించిందా? హక్కుల్ని కాపాడిందా? లేదే?

శర్మగారైనా ఈ మాత్రపు అవగాహన లేనివారు కారని నాకు తెలుసు. అందువల్ల అధిక ప్రసంగం జోలికి వెళ్లకుండా, ప్రస్తుత సందర్భంలోకి సాగి వచ్చేశాను.

"అన్నట్టు మీ రిప్పుడెక్కడ పనిచేస్తున్నారో చెప్పలేదే! జమ్మికోటలో జీవిత శిక్ష మాట ఏమైంది?" అన్నాను.

శర్మగారు తేలిగ్గా నవ్వేశారు – "హైకోర్టు తోసేసింది లేవోయ్ బాలాజీ! ఆరునెలలయింది నేను బదిలీ అయివచ్చి. ట్రంకు రోడ్డుపైన మూడో మైలురాయి దగ్గర ఇండస్ట్రియల్ ఏరియాలో ఒక హైస్కూలుంది గదా! అక్కడ పనిచేస్తున్నాను. హెడ్మాస్టరుగారు చాలా పెద్ద మనిషి, లేటుగా వెళ్లినా పట్టించుకోడు. 'పడుతూ లేస్తూ ఎందుకొచ్చారండీ? ఎట్లాగో అడ్జస్ట్ చేసుకోవచ్చు గదా!" అంటాడు. నాకలాంటివి నచ్చవని నీకు తెలిసిందే! లేటయినప్పుడల్లా సగం రోజుకు సెలవు దరఖాస్తు యిచ్చుకుంటూ వుంటాను. అయినా ఎంత కాలంలే? ఇంకొక రెండేళ్లలో నాకు యాభై అయిదు నిండిపోతాయి. వాలంటరీ రిటైరుమెంటు పుచ్చుకుని మా అమ్మాయి కాన్వెంటులో చేరిపోదామనుకుంటున్నాను..."

సముద్రంలో పడవ ప్రమాదానికి లోనైనవారు కొన్ని రోజుల తర్వాత సురక్షితంగా తీరానికి చేరుకున్నారన్న వార్తను చదివినప్పుడు, కాలి కూలిపోతున్న విమానంలోంచి ప్రయాణీకులు పదిలంగా బయటపడ్డారని విన్నప్పుడు, గనుల్లో మూసుకపోయిన సొరంగాల్లో యిరుక్కుపోయిన కార్మికులు క్షేమంగా వెలుపలికి చేరవేయబడ్డట్టు తెలిసినప్పుడు మనసుకు మహదానందం కలుగుతూ వుంటుంది. శర్మగారితో కలిసి హోటలు గదిలో కూర్చున్న సమయంలో నాకలాంటి ఆనందమే కలిగి వుండొచ్చునని అనుకుంటున్నాను. అయినా ఆ ఆనందాన్ని నేను మాటల్లోకి అనువదించలేకపోయాను. బొత్తిగా సాదాసీదాగా ఒక్కమాట మాత్రం చెప్పగలిగాను.

"మేష్టరుగారూ! ఇక మీ పిల్లల్ని గురించి మీకు దిగుల్లేదండీ!"

మీ వారసుల్ని గురించి – అని వుంటే బాగుండేదేమో! మీరేమంటారు.

❖ రచన – 1997. ❖